# అభివృద్ధి చేసే వారికి అండగా నిలవాలి

- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోశ్‌కుమార్
- బంజారాలు, యాదవులతో ఆత్మీయ సమ్మేళనం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గిరిజన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోశ్ కుమార్, కలెక్టర్ రవి తదితరులు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 2 : అభివృద్ధి చేసే వారికి ప్రజలు అండగా నిలబడాలని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోశ్ కుమార్, కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అయ్యప్పకొండ వద్ద బంజారా సేవాలాల్ మహరాజ్ విగ్రహ నిర్మాణానికి సోమవారం కలెక్టర్ రవినాయక్‌తో కలిసి ఎంపీ, మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం గిరిజన భవనాన్ని ప్రారంభించి బంజారాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఇప్పటివరకు బంజారాల అభివృద్ధి కోసం రూ.14 కోట్లను మంజూరు చేశామన్నారు. మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### ప్రాణాలకు తెగించి ఉద్యమం చేశా..

తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి ఉద్యమం చేశామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సతీసమేతంగా హాజరుకాగా, యాదవ సంఘం నాయకులు గుర్రపు బండిలో ఊరేగిస్తూ బోనాలతో స్వాగతం పలికారు. యాదవ సంఘం నాయకులు క్రేన్ సాయంతో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో మంత్రిని సత్కరించారు. సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో కులమతాలను రెచ్చగొట్టేందుకు చాలా మంది వస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమైక్య రాష్ట్రంలో యాదవుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని విమర్శించారు. యాదవుల అక్షరాస్యతను పెంచేందుకు హన్వాడ మండలంలో రెండు గురుకులాలను తీసుకొచ్చామన్నారు. పేదింటి యాదవ పిల్లల పెండ్లిళ్లు నిర్వహించుకునేందుకు కన్వెన్షన్ హాల్ నిర్మించి, అందులో విద్యార్థులకు హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. యాదవులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. అంతకుముందు తిరుమల హిల్స్‌లో రూ.2కోట్ల వ్యయంతో ఎకరా స్థలంలో నిర్మించనున్న యాదవ కన్వెన్షన్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

### పాలమూరులో హైదరాబాద్ తరహా అభివృద్ధి

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 2 : మహబూబ్‌నగర్‌ను హైదరాబాద్ తరహా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 2, 6, 7, 8, 11, 20, 21, 23, 46వ వార్డుల్లో రూ.17.70 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు.

### గాంధీ స్ఫూర్తితోనే రాష్ట్ర సాధన

పాలమూరు, అక్టోబర్ 2 : మహాత్మాగాంధీ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ అహింసా మార్గంలో రాష్ట్రాన్ని సాధించారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్ హైస్కూల్ వద్ద ఉన్న మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తమ బడిని బాగు చేసుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కళాశాలను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసుకున్నామని, త్వరలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కూడా ప్రారంభించుకుందామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆనంద్‌కుమార్‌గౌడ్, నీరజ, ప్రవీణ్,రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, గొర్రెల కాపరుల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పీఆర్‌టీయూ అధ్యక్షుడు, కార్యదర్శి నారాయణ్‌గౌడ్, రాఘురాంరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు, బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రాజునాయక్, బంజారా ఆలయ కమిటీ చైర్మన్ చంద్రనాయక్, ఎల్ఎన్ఎస్ మెంబర్ రమేశ్‌నాయక్, ప్రతాప్‌నాయక్ పాల్గొన్నారు



గాంధీ విగ్రహానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాళి, మంత్రి దంపతులకు యాదవ సంఘం సన్మానం

# విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు



నీటికి పూజలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 2 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డితో కలిసి రూ.26కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. రేవల్లి మండల కేంద్రంలో రూ.4.87 కోట్లతో నిర్మించిన కేజీబీవీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అందమైన విద్యాలయంగా రేవల్లి కేజీబీవీ నిలుస్తుందన్నారు. జిల్లాలోని 15 కేజీబీవీలకు సొంత భవనాలు ఉన్నాయని, ఐదింటిలో ఇంటర్మీడియట్ విద్య ఉందన్నారు. రేవల్లి కేజీబీవీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని విద్యాలయాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

### ఎంజీకేఎల్ఐ నీటికి పూజలు..

మున్ననూర్ గ్రామానికి చెందిన 28 కుటుంబాల దళిత రైతుల కోసం 25 ఎకరాలకు సంబంధించి ఎగువ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి ఎంజీకేఎల్ఐ కాల్వకు రెండు బోర్లు ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో రైతులతో కలిసి బోర్ల నీళ్లు దుంకే చోట పూలు చల్లి పూజలు చేశారు. రెండో పంట కోసం కేఎల్ఐ నీటికి ప్రత్యామ్నాయంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఏడు బోర్లు మంజూరు చేయించారు. భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో బోరుబావుల తవ్వకాన్ని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. గోపాల్‌పేట మండలం చెన్నూరు, రేవల్లి మండలం గౌరిదేవిపల్లిలో చదువుకుంటున్న విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే రేవలి మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏదుట్ల శివారులో జయన్న తిర్మలాపురం గ్రామానికి చెందిన యువ రైతు పరగోర్ల శివ ఎకరన్నరలో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. మహిళా రైతు కూలీలను పలకరించి రైతును అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామూహిక వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని, తద్వారా వ్యవసాయ కూలీల కొరత ఉండదన్నారు.

### రూ.26 కోట్ల పనులకు శ్రీకారం

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో 18 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, 19 ప్రారంభోత్సవాలు చేశారు. బుద్ధారంలో పీహెచ్‌సీ, డబుల్ బెడ్రూం నిర్మాణాలకు, చెన్నూరులో పీహెచ్‌సీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు, తాడిపర్తి నుంచి చెన్నూరు వరకు, తాడిపర్తి నుంచి మున్ననూర్ వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు, మున్ననూర్‌లో బీసీ కమ్యూనిటీ హాల్, జయన్న తిర్మలాపురం నుంచి రేమొద్దుల రోడ్డు వరకు బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు, ఏదుట్లలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జయన్నతిర్మలాపురంలో వాల్మీకి భవనం, రేమొద్దుల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మాలగుట్ట వెనకకు వేసిన ఫార్మేషన్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీలు సంధ్య, సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘుయాదవ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షులు తిరుపతియాదవ్, నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కోదండం, రఘు రామారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

### మహిళలు ఐలమ్మ ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 2 : ఐలమ్మ ధైర్యాన్ని నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోలీపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్, జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, సర్పంచు పద్మ, నా యకులు ఉన్నారు.

### అన్ని వర్గాలు ఆర్థికంగా ఎదగాలి

పెద్దమందడి, అక్టోబర్ 2 : సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగత్‌పల్లి, మనిగిల్ల, పెద్దమందడి, దొడగుంటపల్లి గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగత్‌పల్లిలో రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవ న నిర్మాణానికి శంకుస్థాపన, రూ.10 లక్షలతో శివాలయం ప్రహరీ, మనిగిల్లలో రూ.6.5 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి, మనిగిల్ల గ్రామం నుంచి చౌట చెరువు అలుగు వర కు, కొండ రవి పొలం నుంచి బుగ్గపల్లి తండా వర కు ఫార్మేషన్ రోడ్డు, పెద్దమందడి మండలకేంద్రంలో రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, రూ.20 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు , దొడగుంటపల్లి నుంచి అంకూరు వరకు రూ.90లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పామిరెడ్డిపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

### మంత్రి సమక్షంలో చేరికలు

పెద్దమందడి, అక్టోబర్ 2: మండలంలోని మనిగిల్ల గ్రామానికి చెందిన 60మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కొండా ర వీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షం లో బీఆర్‌ఎస్‌లో చేరారు. పెబ్బేరు మం డలం గుమ్మడం తండాకు చెందిన 33 మంది తండా అధ్యక్షుడు హనుమంతునాయక్, యూత్ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో దొడగుంటపల్లిలో మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. గో పాల్‌పేట మండలంలోని జయన్న తిరు మలాపురం, రేవల్లి మండలంలోని గొల్ల పల్లి గ్రామానికి 50మంది మంత్రి సమక్షంలో బీఆర్ ఎస్‌లో చేరారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన మనిగిల్ల యువకులతో మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు

# పార్టీకి కాదు.. పదవులకు రాజీనామా చేయాలి

- స్వార్థపూరిత రాజకీయాలు మానుకోవాలి
- నైతిక విలువలుంటే ప్రజాక్షేత్రంలోకి రావాలి
- విలేకరుల సమావేశంలో విప్ గువ్వల బాలరాజు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఎమ్మెల్సీ కశిరెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌పై ఫైర్

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 2 : స్వార్థప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్‌ను వీడిన ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పార్టీకి కాకుండా తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సూచించారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి విప్ గువ్వల విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ, జెడ్పీ వైస్‌చైర్మన్ సీఎం కేసీఆర్ ఆదేశాలను ధిక్కరించి స్వార్థపూరితంగా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. వారిద్దరికి ముఖ్యమంత్రి కేసీఆర్ అద్భుతమైన అవకాశాలు కల్పించి ఆదరిస్తే ఆ పదవులకు కళంకం తీసుకొచ్చారన్నారు. దురాలోచన, దురాశతో కుట్ర పూరితమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. కల్వకుర్తి ప్రజలు చాలా చైతన్యవంతులని.. వారు బీఆర్‌ఎస్‌ను ఎందుకు వీడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. వారికి ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన, తపన లేదని.. పదవి వ్యామోహం, వ్యాపారం చేయడమే లక్ష్యంగా కొనసాగారని విమర్శించారు. స్వార్థపూరిత రాజకీయాలు మానుకోవా లని హితవు పలికారు. మంత్రులతో సన్నిహితంగా ఉన్నట్లు నటిస్తూ పైరవీలు చేశారే తప్పా ప్రజా సేవచేయలేదన్నారు. పదవిలో ఉన్నప్పటికీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీనైనా గెలిపించుకున్నాడా అని ప్రశ్నించారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్‌ను మళ్లీ గెలిపించుకొని గులాబీ జెండా ఎగరవేద్దామన్నారు. కుల రాజకీయాలు చేసే కాంగ్రెస్, మత రాజకీయాలు చేసే బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సోనియాగాంధీని బలిదేవత అన్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇప్పుడు తెలంగాణ దేవత అంటూ కొలుస్తున్నాడని విమర్శించారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడేవారికి డిపాజిట్లు గల్లంతుకావడం ఖాయమన్నారు. నైతిక విలువలుంటే వెంటనే పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ మనోహర, సర్పంచ్ జంగయ్య, నాయకులు పాల్గొన్నారు.